


ప్రకాశం



మార్కాపురం



బాపట్ల


షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

గురువారం 19 మార్చి 2026


**పరాభవ నామ సంవత్సర ఉగాది ప్రత్యేక సంచిక**

# తెలుగు సాంస్కృతిక వైభవ పునాది ఉగాది

## పరాభవ నామ సంవత్సర ఉగాదికి స్వాగతం

## ఉగాది తెలుగు వారికి అత్యంత ప్రీతిపాత్రమైన పండుగ

## ఉగాది తెలుగు వారి సాంస్కృతిక వైభవ పునాది

## తెలుగు వారికి కొత్త సంవత్సరం ఉగాదితోనే ప్రారంభం




మొత్తం తెలుగు సంవత్సరాలు 60. వీటిలో ప్రభవ మొదటి సంవత్సరం కాగా అక్షయ చివరి సంవత్సరం. తెలుగు సంవత్సరాలు ఒకదాని తర్వాత మరొకటి వరుసగా వస్తుంటాయి. 2026 మార్చి 19 న జరుపుకునే తెలుగు సంవత్సర ఉగాది పేరు శ్రీ పరాభవ. పేరును బట్టి ఈ సంవత్సరమంతా ప్రతి ఒక్కరికి అవమానాలే కలుగుతుంటాయని భయ పడకుండా పదిమంది మెచ్చుకునే పనులను చేసేందుకు మానవుడు పూనుకోవాలి. అప్పుడు పరాభవానికి బదులు సన్మానాలు,

2లో..




# తెలుగు సాంస్కృతిక వైభవ పునాది ఉగాది

ఇంటా బయటా పదుగురి ప్రశంసలకు పాత్రులు కావడం జరుగుతుంది. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోగలగాలి. వ్యతిరేక భావనలను మనసులోకి రానివ్వకుండా మనలోని చెడును తొలగించుకునేందుకు మనలను మనం పవిత్రీకరించుకునేందుకు కృషి చేయాలి. అప్పుడు సర్వోన్నత గుణశీలురం కాగలుగుతాం. భారతీయ సంస్కృతిలో కాలాన్ని భగవంతుని స్వరూపంగా భావించడం జరుగుతుంది.

**యుగాది.. ఉగాది:**

ఉగాది అనే పదం యుగాది అనే పదం నుండి ఏర్పడింది. కాలాన్ని మన పూర్వీకులు యుగం, సంవత్సరం, అయనం, ఋతువు , మాసం, అహోరాత్రం, ముహూర్తం, కల, కాష్ట, నిమేషం, ఇలా సూక్ష్మీకరించారు. తెలుగు సంవత్సరాలలో మొదటిది ప్రభవ. 60వ సంవత్సరం అక్షయ. ప్రస్తుతం 2026 మార్చి 19న జరుపుకునే శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది 40వది. ఉగాది ప్రకృతి సిద్ధమైన పండుగ, తెలుగు ప్రజలకు సంబంధించినంత వరకు క్రొత్త సంవత్సరంలో వేడుకగా జరుపుకోబడే అతి పెద్ద పండుగ ఉగాది. ఉగాదికి స్వాగతం పలికేందుకు ప్రకృతి నవ వధువులా ముస్తాబవుతుంది, క్రొత్త అందాలను సంతరించుకుని కోకిలమ్మతో కలిసి వసంత ఋతు రాగాలను ఆలపిస్తుంది. ఋతువులలో తాను వసంత ఋతువునని శ్రీకృష్ణ పరమాత్మ పేర్కొన్నారు. చతుర్ముఖ బ్రహ్మ చైత్ర శుద్ధ పాడ్యమి నాడు సూర్యోదయ వేళలో సృష్టి రచనకు శ్రీకారం చుట్టినట్లు పురాణ గాథలు వెల్లడిస్తున్నాయి. ఉగాది అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది ఆరు రుచులతో కూడిన ఉగాది పచ్చడి, తీపి, పులుపు, చేదు, వగరు, ఉప్పు, కారం అనే ఆరు రుచుల సమ్మిళితమైన ఉగాది పచ్చడిని తినడం వల్ల కడుపులోని హాని కారక సూక్ష్మ క్రిములు నశించి ఆరోగ్యం కాపాడబడుతుంది.

**పంచాంగ శ్రవణం:**

ఉగాది అనగానే అందరికీ స్ఫురించే మరొక అంశం పంచాంగ శ్రవణండ. కాలజ్ఞానానికి ప్రతీక పంచాంగం. తిథి వార నక్షత్ర యోగ కరణాలనే ఐదు



అంశాలతో కూడిన పంచాంగ శ్రవణ కార్య క్రమాన్ని సహజంగా దేవాలయాలలో లేదా ముందుగా నిర్ణయమైన ప్రదేశాలలో నిర్వహిస్తారు. పంచాంగకర్తలు పురోహితులు అర్చకులు సహజంగా పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. కాలజ్ఞాన స్వరూపమైన పంచాంగ ఫలితాలను వినడం ద్వారా మానవులు భవిష్యత్తులో జరగబోయే అనర్థాలను నివారించేందుకు అవకాశం కలుగుతుంది, పంచాంగ శ్రవణం వల్ల పాపాలు నశిస్తాయి. పవిత్ర గంగా నదిలో స్నానం చేసిన పుణ్యఫలం ప్రాప్తిస్తుంది. సత్సంతానం కలుగుతుంది. సంపదలు సమకూరుతాయి. కాలమాన పరిస్థితుల్లో వస్తున్న మార్పుల వల్ల పండుగలు జరుపుకునే విషయంలో కొంత నిరాసక్తత ఎదురవుతున్న మాట నిజం. తెలుగు జాతి సాంస్కృతిక ధార్మిక ఆధ్యాత్మిక వైభవ ప్రతీకలైన పండుగలను జరుపుకునే విషయంలో తెలుగువారు నిరాసక్తత వీడి నిరంతర ఉత్సాహంతో పురోగమించాలని ఆశిద్దాం.



(ఎంవిఎస్ శాస్త్రి, ఒంగోలు)
(సెల్ 99484 09528)

## పుల్లలచెరువులో శరవేగంగా

# సీసీ రోడ్డు పనులు

**విబి జీ రాంజీ (ఉపాధిహామీ) మెటీరియల్ నిధులతో గ్రామాభివృద్ధి**

**ఎరిక్షన్ బాబు చొరవతో పయ్యావుల ప్రసాద్ ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణం**

**రూ.50 లక్షల వ్యయంతో 580 మీటర్ల సీసీ రోడ్డు**

**(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, మార్చి 18)**

పుల్లలచెరువు మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. విబి జి రాంజి (ఉపాధిహామీ) పథకం మెటీరియల్ నిధులతో దాదాపు రూ.50 లక్షల వ్యయంతో 589 మీటర్లు పొడవు 3.75 మీటర్లు వెడల్పు మేర సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా గుంతలతో దెబ్బతిన్న ఈ రహదారి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం చేపట్టిన పనులతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.ఎర్రగొండపాలెం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు చొరవతో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్ సహకారంతో ఈ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి.పుల్లలచెరువు మండల కేంద్రం నుంచి ఆర్ ఉమ్మడివరం గ్రామానికి వెళ్లే ఈ రహదారి చాలా కాలంగా గుంతలతో దెబ్బతిన్న స్థితిలో ఉండటంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. ఈ రహదారి గుంతల కారణంగా పుల్లలచెరువు మీదుగా హైదరాబాద్, ఎర్రగొండాపాలెం, మార్కాపురం వెళ్లే బస్సులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. గ్రామంలో ఉన్న మూల



మలుపుల వద్ద బస్సులు సరిగా తిరగలేక డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన పయ్యావుల ప్రసాద్ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయించాలని నిర్ణయించి పనులను వేగంగా చేపట్టించారు. రోడ్డు పనులు పూర్తయితే పుల్లలచెరువు మీదుగా అటుపైవుగా వెళ్లే బస్సులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సులభంగా ప్రయాణించగలవని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.పయ్యావుల ప్రసాద్ పుల్లలచెరువులో రాజకీయ కార్యకలాపాలు ప్రారంభించినప్పటి నుంచి గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నారని స్థానికులు తెలిపారు.ప్రభుత్వం లేని సమయంలో కూడా తన సొంత ఖర్చులతో త్రాగునీటి బోర్లు వేయించడంతో పాటు



అంతర్గత రహదారులకు మట్టి వేయించి ప్రజలకు సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. మండల పార్టీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టి, కార్యకర్తలకు అవసరమైన సమయంలో సహాయం చేస్తూ ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నారని తెలిపారు. ఈ సీసీ రోడ్డు పూర్తయితే పుల్లలచెరువు నుంచి ఆర్ ఉమ్మడివరం మీదగా వెళ్లే ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని గ్రామస్థులు తెలిపారు.



తిమిరాన్ని పారదోలే ఉషోదయంలా,
చిగురాకుల ఊయలలో నవరాగాల కోయిలలా
అడుగిడుతున్న ఉగాదికి స్వాగతం
శ్రీ పరాభవ నామ సంవత్సర
ఉగాది
శుభాకాంక్షలు
తాటిపర్తి చంద్రశేఖర్
యమ్.ఎల్.ఎ. యర్రగొండపాలెం
లింగంగుంట్ల రాములు
వైస్ యం పి పి పుల్లల చెరువు,
YSRCP రాష్ట్ర SC సెల్ జనరల్ సెక్రటరీ




లేత మామిడి ఆకుల తోరణాలు శ్రావ్యమైన
సన్నాయి రాగాలు అందమైన ముగ్గులతో
వీది వాకిళ్ళు కొత్త బట్టలతో పిల్లా పాపలు
ఉగాది పండుగ సంబరాలు
శ్రీ పరాభవ నామ సంవత్సర
ఉగాది
శుభాకాంక్షలు
తాటిపర్తి చంద్రశేఖర్
యమ్.ఎల్.ఎ. యర్రగొండపాలెం
కొర్లకుంట జానకి రఘు
YSRCP జిల్లా ఆర్గనైజర్, జనరల్ సెక్రటరీ

# ఉగాది రోజు పూజ ఎప్పుడు చేయాలి?





తెలుగు సంవత్సరాది ఉగాది..అత్యంత పవిత్రమైన రోజు. కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలతో ముందుకెళ్లాల్సిన శుభదినం. తెలుగువారి నూతన సంవత్సరం మరో కొద్ది రోజుల్లో అంటే 2026 మార్చి 19న ప్రారంభం కానుంది. పండితులు తెలిపిన వివరాల ప్రకారం.. వచ్చే కొత్త సంవత్సరం పేరు పరాభవనామ సంవత్సరం. జ్యోతిష్యశాస్త్రం ప్రకారం పరాభవం అంటే గర్వం.. అహంకారం.. స్వార్థం అని అర్ధం. పండితులు తెలిపిన వివరాల ప్రకారం.. పరాభవం అంటే ఏమిటి.. కొత్త సంవత్సరం విశేషాలు.. రహస్యాలు ఏమిటి.. పండితులు ఏం చెబుతున్నారో ఈ స్టోరీలో తెలుసుకుందాం... తెలుగు పంచాంగం ప్రకారం.. కొత్త సంవత్సరం.. పరాభవ నామ సంవత్సరం మార్చి 19న ప్రారంభం కానుంది. కొత్త సంవత్సరం గురించి .. ఆధ్యాత్మికంగా పరిశీలించినట్లైతే.. ఇలాంటి వ్యతిరేక లక్షణాలను లక్షణాలను జయించి వినయం వైపు నడిపించే కాలాన్ని సూచిస్తుంది. ప్రతి వ్యక్తి తన లోపాలను గుర్తించి..వాటిని అధిగమించడానికి ప్రయత్నించే సంవత్సరమని పండితులు వివరిస్తున్నారు. పరాభవం అంటే ఏమిటి.. పురాణాల ప్రకారం తెలుగు కాలచక్రంలో 60 సంవత్సరాలు ఉంటాయి. ఈ చక్రంలో పరాభవ అనేది 40వ సంవత్సరం. సంస్కృతంలో ..పరాభవ.. అంటే ఓటమి.. అపజయం .. అవమానం అనే అర్థాలు ఉన్నాయి. కాని జ్యోతిష్యనిపుణులు , ఆధ్యాత్మిక పండితుల విశ్లేషణ ప్రకారం .. పరాభవ నామ సంవత్సరానికి లోతైన తాత్పర్యం ఉందని చెబుతున్నారు. కొత్త సంవత్సరం పేరులో ప్రతికూలత ఉన్నా కాని.. మనిషి జీవితంలో మార్పు, ఆత్మపరిశీలన, ఆత్మవికాసాన్ని సూచించేందుకు ఒక సంకేతమని చెబుతున్నారు.

**ఏ పని తలపెట్టినా విజయం సిద్ధిస్తుందని నమ్మకం**

తెలుగు సంవత్సరాది అయిన ఉగాది పండుగను ఎంతో శుభప్రదంగా భావిస్తారు. ఈ రోజున ఏ పని తలపెట్టినా విజయం సిద్ధిస్తుందని నమ్ముతారు. అందుకే చాలా మంది భగవంతుడిని ప్రార్థించి కొత్త పనులు ప్రారంభించాలనుకుంటారు. అయితే ఉగాది రోజున ఏ సమయం మంచిది? పూజకు సరైన ముహూర్తం ఎప్పుడు అనే సందేహం చాలా మందికి ఉంటుంది.

**ఉగాది రోజు పూజకు శుభ ఘడియలు**

పంచాంగం ప్రకారం ఉగాది రోజున సూర్యోదయం తర్వాత పూజలు చేయడం మంచిదని భావిస్తారు. ఉదయం 6 నుంచి 10 గంటల మధ్య పూజలు చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని పండితులు చెబుతున్నారు. ఈ సమయంలో దేవుడిని ప్రార్థించి కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించాలని సూచిస్తున్నారు.




తీపి చేదు కలిసిందే జీవితం, కష్టం, సుఖం తెలిసిందే జీవితం,
ఆ జీవితంలో ఆనందోత్సాహాలను పూయించేందుకు వస్తోంది
మీకు, మీ కుటుంబ సభ్యులందరికీ శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాదిని
ముగిస్తూ శ్రీ పరాభవ నామ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భముగా ఇవే నా
ఉగాది శుభాకాంక్షలు
మాదిరెడ్డి కొండారెడ్డి
ప్రెసిడెంట్ – ది ముంబై ఆంధ్ర మహాసభ


పాత సంవత్సరపు చేదు, తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ...
కొత్త ఆశలతో కొత్త సంవత్సరంలో... అడుగిడుతున్న సందర్భంలో..
మీ ఆశయాలు నెరవేరాలని ఆకాంక్షిస్తూ...
శ్రీ పరాభవ నామ సంవత్సర
ఉగాది
శుభాకాంక్షలు
అభిమాని, పొదిలి


జీవితం సకల అనుభూతుల మిశ్రమం,
స్థిత ప్రజ్ఞత అలవరచుకోవడం వివేకి లక్షణం
అదే ఉగాది తెలిపే సందేశం...
శ్రీ పరాభవ నామ సంవత్సర
ఉగాది
శుభాకాంక్షలు
తాటిపర్తి చంద్రశేఖర్
యమ్.ఎల్.ఎ. యర్రగొండపాలెం
తమ్మినేని సత్యనారాయణ రెడ్డి
చాపలమడుగు గ్రామ సర్పంచ్, పుల్లలచెరువు మండలం


ప్రకృతిని పులకరింప చేసేదే చైత్రం మనసును
పలకరించే మన స్నేహం షడ్రుచుల కలబోత మన బంధం
అనుభూతులతో నిత్య నూతనం.
శ్రీ పరాభవ నామ సంవత్సర
ఉగాది
శుభాకాంక్షలు
ఉప్పల నాగేశ్వరరావు
CHEMIST & DRUGGIST
ప్రొ: యు. నాగేశ్వరరావు
Cell: 97016 97858
SRI BALAJI MEDICAL STORES
DRUG Licence No:
20/15/AP/PS(M) 2007/6
21/15/AP/PS(M) 2007/R
శ్రీ బాలాజి మెడికల్ స్టోర్స్
డోర్ నెం: 4-69 B-మెయిన్‌రోడ్, పుల్లలచెరువు,పుల్లలచెరువు మండలం,మార్కాపురం జిల్లా,( ఆంధ్రప్రదేశ్ -523328)

# కాలజ్ఞానం పంచాంగం




కాలం భగవత్స్వ రూపం. కాలస్వరూపాన్ని అది మనపై చూపించే ప్రభావాన్ని పలువురు జ్ఞానులు లోకానికి తెలియ చెప్పారు. సత్య సత్వ గుణ సంపన్నులైన మహర్షులు కాలపురుషుడైన పరమాత్మను వివిధ రూపాలలో దర్శించి కాలజ్ఞానాన్ని పొందిన వారై దానిని తాళపత్రాల రూపంలో భద్రపరిచారు. కాల పరిణామ క్రమానికి సంబంధించిన జ్ఞానాన్ని మనకు తెలియ చెప్పే పుస్తకాన్ని పంచాంగం లేదా కాలజ్ఞానం అని అంటారు. ఒక విధంగా పంచాంగం తెలుగు వారి పాలిట జీవన భగవద్గీతగా పేర్కొనవచ్చు, తమిళులకు సౌర మానం ప్రధానమైనట్లే తెలుగువారికి చాంద్రమానం అత్యంత ప్రధానమైనది, చాంద్రమానాన్ని అనుసరించి తెలుగు సంవత్సరాలు 60. వీటిలో ప్రభవ మొదటి సంవత్సరం కాగా అక్షయ చివరి సంవత్సరం. తెలుగు సంవత్సరాలు ఒకదాని తర్వాత మరొకటి వరుసగా వస్తుంటాయి, తెలుగు సంవత్సరాదిని ఉగాది అని కూడా పిలుస్తారు. యుగాది అనే పదం క్రమేణా ఉగాదిగా మారింది. తిథి వార నక్షత్ర కరణ యోగమనే ఐదు అంశాల సమాహారాన్ని పంచాంగం అని వ్యవహరిస్తారు. ప్రతి ఒక్కరి జాతకాన్ని జీవితాన్ని ప్రభావితం చేసే శక్తి పంచాంగానికి ఉంది. తెలుగు సంస్కృతిలో ఉగాది పర్వదినానికి పంచాంగ శ్రవణానికి ఉన్న ప్రాధాన్యత ఎల్లరకూ విదితమే. పుట్టుక నుండి మరణం వరకు మానవ జీవితంలోని అత్యంత ప్రధాన ఘట్టాలకు పంచాంగం ప్రత్యక్ష సాక్షిగా నిలుస్తుంది. తాము చేపట్టే ఏ పని అయినా నిర్విఘ్నంగా శుభప్రదంగా పూర్తి కావాలని ప్రతి ఒక్కరు కోరుకుంటారు. అయితే అనేక మందికి ఏ ముహూర్తంలో ఒక పనిని ప్రారంభిస్తే విజయవంతంగా పూర్తి అవుతుందో అవగాహన ఉండదు. పైగా గ్రహాలు, నక్షత్రాలు తిథులు వంటి వాటిని ఆధారంగా చేసుకుని ముహూర్తాలు నిర్ణయం చేయడం పురోహితుల దైవజ్ఞుల జ్యోతిష శాస్త్రవేత్తల కర్తవ్యంగా మారింది. ఏయే పండుగలను ఎప్పుడు జరుపుకోవాలో కాలమానం ఆధారంగా పంచాంగాలు చాటి చెబుతాయి. ప్రాంత రాష్ట్ర దేశ అంతర్జాతీయ పరిణామాల గురించి కూడా పంచాంగ కర్తలు వివరిస్తారు. అలాగే రాశుల వారీగా రాజపూజ్య రాజ అవమానాల గురించి ఆదాయ వ్యయాల గురించి కూడా పంచాంగకర్తలు తెలియ చెబుతారు. శుభ ముహూర్తాలతో పాటు వ్యక్తి జాతక చక్రంలో ఏవైనా లోపాలు దోషాలు ఉంటే వాటి పరిహార మార్గాన్ని కూడా. పంచాంగ కర్తలు సూచిస్తారు. ఉగాదినాడు పంచాంగ శ్రవణాన్ని చక్కగా వినడం ద్వారా భవిష్యత్తులో జాగ్రత్తగా ఎలా మెలగాలో కూడా బోధపడుతుంది. పంచాంగ శ్రవణం వల్ల పాపాలు నశించడంతోపాటు పవిత్ర గంగా నదిలో స్నానం చేసినంత పుణ్యఫలం లభిస్తుందని, సత్సంతానం సకల సంపదలు సిద్ధిస్తాయని పెద్దలు పేర్కొంటున్నారు.

పంచాంగ కర్త చక్కటి శాస్త్ర పాండిత్యంతో పాటు గణిత ఖగోళ అంతరిక్ష జ్యోతిష వేద విజ్ఞాన శాస్త్రాలతో పాటు గ్రహగతులను గురించిన పరిజ్ఞానాన్ని ముహూర్త నిర్ణయంలో చక్కటి అవగాహన కలిగిన వాడై ఉండాలి. ఒక విధంగా చెప్పాలంటే పంచాంగాన్ని భగవంతుని దివ్య వాక్కుగా భావించవచ్చు. తెలుగువారి కొత్త సంవత్సరం ఉగాదితోనే ప్రారంభమవుతుంది. తెలుగు వారికి చాంద్రమానం ప్రధానమైనట్లే తమిళులకు సౌర మానం ముఖ్యమైనది. చైత్ర శుద్ధ పాడ్యమి నాడు బ్రహ్మ సృష్టి రచనకు శ్రీకారం చుట్టినట్లు భావించబడుతుంది. ఋతువులలో మొదటిది వసంత రుతువు, మాసాలలో చైత్రమాసం తొలి మాసం. పక్షాలలో శుక్లపక్షం మొదటిది. తిథులలో పాడ్యమి మొదటిది, తెలుగు సంవత్సరాలు 60. వీటిలో మొదటిది ప్రభవ, చివరిది అక్షయ. ఈ 60 సంవత్సరాలు ఒక దాని తర్వాత మరొకటి వరుసగా వస్తూనే ఉంటాయి. కాల ప్రమాణాన్ని గుర్తించటానికి పంచాంగమే అత్యంత కీలకమని చెప్పవచ్చు.



**వేద కాలం నుండి పంచాంగాల ప్రస్తావన:**

పంచాంగాలకు చాలా ప్రాచీనమైన చరిత్ర ఉందని చెప్పవచ్చు. పంచాంగాల ప్రస్తావన వేద సాహిత్యంలో కూడా కనిపిస్తుందని పెద్దలు పేర్కొంటున్నారు. బోధాయన మహర్షి బోధాయన సూత్రాల ద్వారా ఆచార సంప్రదాయాల గురించి మానవ సంస్కారాల గురించి తెలియజేశారు. ఆపస్తంభ మహర్షి పంచాంగానికి సంబంధించిన ధర్మ శుల్బ సూత్రాలను రచించారు. లగధుడు వేదాంగ జ్యోతిష్యం రచించాడు. ఋగ్వేద యజుర్వేద అథర్వణ వేద జ్యోతిష్యం అనే అంశాలు దానిలో ఉన్నాయి. కాత్యాయన మహర్షి పంచాంగ విజ్ఞానాన్ని మరింత పరిపుష్టం చేసారు. ఆర్యభట్టు ఆర్య భట్టీయం అనే గ్రంథంలో గణిత శాస్త్ర అంశాలతో పాటు గ్రహగతులు గ్రహణాలు వంటి వాటి గురించి తెలియ చెప్పారు. బ్రహ్మగుప్తుడు.. భాస్కరుడు.. మహేంద్ర సూరి.. నీలకంఠ సోమయాజి మొదలైన వారు పంచాంగాన్ని మరింత పరిపుష్టం చేసారు. కాలాన్ని గణించే విధానానికి వారు మరింత మెరుగులు దిద్దారు.

**తొలి పంచాంగ కర్త మయాసురుడు :**

త్రేతా యుగంలో రావణాసురుని మామ మయాసురుడు సూర్య భగవానుని ద్వారా పొందిన జ్ఞానంతో సూర్య శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. సూర్య గమనంతో పాటు ఇతర గ్రహాల సంచారం గ్రహణాలు తిథి వార నక్షత్ర యోగ కరణాలతో పాటు నక్షత్ర గ్రహ స్ఫుటాల గురించి శాస్త్రీయంగా వివరించాడు. వరాహమిహిరుడు పంచ సిద్ధాంత గ్రంథాన్ని రచించాడు. వీటిలో సూర్య సిద్ధాంతం అతి ప్రాచీనమైనదిగా పేరొందింది. పంచాంగ రచనలో పండితులు పూర్వ గణిత సిద్ధాంతం, దృక్ గణిత సిద్ధాంతం అనే వాటిని ఎక్కువగా అనుసరిస్తుంటారు. ప్రాంతాన్ని బట్టి పంచాంగ రచనలో కొందరు చాంద్ర మానాన్ని మరికొందరు సౌర మానాన్ని ప్రామాణికంగా తీసుకుంటారు. సూర్య సిద్ధాంతంగా పేరొందిన దృక్ గణిత సిద్ధాంతాన్ని నేడు పలువురు అనుసరిస్తున్నారు.

1526లో గణేశ దైవజ్ఞుడు రచించిన గ్రహ లాఘవం గ్రంథం ఆధారంగా తొలి పంచాంగాన్ని హిందీలో 1831 లో ప్రచురించారు.

**తెలుగులో తొలి పంచాంగం:**

తెలుగులో తొలి పంచాంగం 1887లో మద్రాసులో ప్రచురితమైంది. సూర్య సిద్ధాంతం పేరిట ఈ పంచాంగాన్ని ప్రచురించారు, పూర్వ పద్ధతికి కూడా ఈ పంచాంగంలో చోటు కల్పించారు. పిడమర్తి చలమయ్య సిద్ధాంతి 19వ శతాబ్దిలో తెలుగు పంచాంగానికి నాంది పలికారు. ఆధునిక శాస్త్ర పరికరాలు లేని కాలంలోనే మన మహర్షులు, పంచాంగ కర్తలు గ్రహగతులను, గ్రహణాలను గణిత శాస్త్ర పరంగా కచ్చితంగా నిర్ధారించడం విశేషం. నేడు కంప్యూటర్లు ఆధునిక శాస్త్ర పరికరాల సహాయంతో శాస్త్రవేత్తలు గ్రహణాలతో పాటు గ్రహగతుల గురించి గురించి చెబుతున్న దానికి అలాంటి ఆధునిక పరికరాలు ఏవీ వాడకుండానే పంచాంగ కర్తలు చెబుతున్న దానికి పెద్దగా తేడా లేకపోవడం గమనార్హం.

**ఎన్నో పంచాంగాలు :**

తెలుగులో నేడు ఎన్నో రకాలైన పంచాంగాలు అందుబాటులో ఉన్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించే పంచాంగంతో పాటు రేలంగి, తంగిరాల, నేమాని, పిడపర్తి, బుట్టే వారి పంచాంగం, జూటూరు వారి పంచాంగం, ములుగు పంచాంగం, ఆనందసిద్ధి పంచాంగం, కుప్పా పంచాంగం, గుప్తా పంచాంగం, గార్గేయ పంచాంగం, శ్రీ విఖనస ఆర్ష ధర్మ పీఠం వారి పంచాంగం, గంటల పంచాంగం వంటి పలు రకాలైన పంచాంగాలు నేడు దర్శనమిస్తున్నాయి. అమెరికాతోపాటు పలు విదేశాలలో, ఖండాంతరాలలో నివసిస్తున్న ప్రవాస ఆంధ్రులకు ప్రవాస భారతీయులకు ఉపయుక్తమయ్యే విధంగా కూడా ముహూర్తాలను పంచాంగ కర్తలు ప్రత్యేకంగా తెలియ చెబుతుండడం ముదావహం. కాలజ్ఞానాన్ని భవిష్య వాణిని ముందుగానే గుర్తించి పంచాంగాల రూపంలో తెలియచేసే వారిని దైవజ్ఞులుగా వ్యవహరిస్తారు. పండుగల నిర్ధారణలో కొన్నిసార్లు అయోమయ పరిస్థితి ఎదురవుతుంటుంది. ఇటువంటి సందర్భాలలో పండితులు సరైన నిర్ణయం కోసం నిర్ణయ సింధు, ధర్మసింధు, కాల నిర్ణయ చంద్రిక, సుదర్శన కాల నిర్ణయం, వ్రత నిర్ణయ కల్పవల్లి, ధర్మ ప్రవృత్తి వంటి గ్రంథాలను పరిశీలన చేసి నిర్ణయాన్ని తెలియ చెబుతుంటారు. తెలుగు రాష్ట్రాలలోని తెలుగు ప్రజలు చాంద్ర మానం ఆధారంగానే పండుగలు జరుపుకోవాలని, జాతక రచన విషయంలో కూడా చాంద్రమానాన్ని కొలమానంగా తీసుకోవాలని పలువురు పండితులు సూచిస్తున్నారు. హిందువులతో పాటు మహమ్మదీయులకు, క్రైస్తవులకు కూడా చాంద్రమానమే ఆధారమని ప్రముఖ నామ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ పడవల నాగమల్లేశ్వరరావు వంటి భాషా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. తెలుగు రాష్ట్రాలలో జన్మించే వారికి చాంద్రమానం ఆధారంగానే జాతకాలు లిఖించాలని సౌర మానం ఆధారంగా జాతకాలు లిఖిస్తే కొన్ని తేడాలు కలిగే అవకాశం ఉంటుందని జ్యోతిష శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. చాంద్ర మానంలోని మూఢమి, శూన్య మాసాలు తెలుగు వారికి ఉన్నాయి. తమిళులకు లేవు. తెలుగు రాష్ట్రాలలో ప్రభుత్వాలు చాంద్రమానం ప్రకారమే పండుగలు నిర్ణయించాలనేది పలువురి ఆకాంక్ష.

(ఎంవిఎస్ శాస్త్రి, ఒంగోలు)
(సెల్ 99484 09528 )


కనిగిరి నియోజకవర్గ ప్రజలకు,
నాయకులకు, కార్యకర్తలకు,
శ్రేయోభిలాషులకు
శ్రీ పరాభవ నామ సంవత్సర
ఉగాది
శుభాకాంక్షలు
డా॥ పెరుగు మురళీ కృష్ణ
M.B.B.S., M.D., C.Diab (Apollo)
మెడికల్ కౌన్సిల్ మాజీ సభ్యులు,
వైస్సార్‌సీపి రాష్ట్ర వైద్య విభాగం మాజీ కార్యదర్శి,
కనిగిరి నియోజకవర్గం